జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



## అమావాస్య సందర్భంగా కొత్తకొండలో చండీ హోమం



**భీమదేవరపల్లి/ఏప్రిల్17 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో అమావాస్య సందర్భంగా శనివారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు, గ్రామ ప్రజలు, పెద్దలు, పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా చండీ హోమాన్ని నిర్వహించగా, దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టారు. అనంతరం భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణ అధికారి పి. కిషన్ రావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి: జేఏసీ

### అంబేద్కర్ కూడలిలో జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా

**భీమదేవరపల్లి/ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద జేఏసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలు ధర్నా, రాస్తారోకో నిర్వహించాయి. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్రంపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 60 సంవత్సరాల సుదీర్ఘ తెలంగాణ ఉద్యమం, 1200 మంది అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. డా.బిఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ఆధారంగా, సోనియాగాంధీ దాతృత్వం, సుష్మాస్వరాజ్ ప్రోత్సాహంతో పార్లమెంటులో మెజార్టీ మద్దతుతో తెలంగాణ చట్టబద్ధంగా ఏర్పడిందని తెలిపారు. తెలంగాణ ఏర్పాటును భారత్ నుంచి పాకిస్తాన్ విడిపోయినట్లు పోల్చడం తీవ్రంగా అభ్యంతరకరమని, ఇది అమరుల త్యాగాలను అవమానపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు చేసిన తేజస్వి సూర్యపై చట్టపరమైన చర్యలు తీసుకుని అతని పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్



చేశారు. ఇక తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు ఈ అంశంపై మౌనం పాటించడం కూడా సమర్థనగా భావించాల్సి వస్తుందని, వారి వైఖరిని ఖండిస్తున్నామని తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్, డిలిమిటేషన్ వంటి కీలక అంశాలపై చర్చించాల్సిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల సమయంలో, ఈ విషయాన్ని లేవనెత్తడం అనవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వా లక్ష్మారెడ్డి, మండల జేఏసీ చైర్మన్ దేగల సారయ్య, అఖిలపక్ష నాయకులు కొలుగూరి రాజు, మండల సురేందర్, జక్కుల అనిల్, మాడుగుల అశోక్, డబ్బా శంకర్, రేణిగుంట్ల బిక్షపతి, రచ్చ సంపత్, దస్తరి ఉమామహేశ్వర్, బేరే యాదగిరి, మాడుగుల పోచయ్య, అంబాల రాజు, ఒగ్గే శేఖర్, చల్లూరు భాస్కర్, ఆదరి రమేష్, మార్పాటి మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ రెడ్డి డిమాండ్

### మే 5న భారీ ధర్నాకు జేఏసీ పిలుపు

**భీమదేవరపల్లి/ఏప్రిల్17 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర నాయకుడు అటుకుల శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భోజన విరామ సమయంలో తహసిల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలం నుంచి పేరుకుపోయిన సమస్యలు ప్రస్తుత ప్రభుత్వంలో కూడా పరిష్కారం కాకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పిఆర్సి అమలు, పెండింగ్ బిల్లులు, హెల్త్ కార్డుల అమలు, సిపిఎస్ రద్దు వంటి అంశాలు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉన్నప్పటికీ వాటి అమలులో ప్రభుత్వం చొరవ చూపడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇదే విధంగా వ్యవహరిస్తే మే 5న జిల్లా కేంద్రాల్లో భారీ ధర్నాలు నిర్వహిస్తామని, జూన్ నెలలో లక్ష మందితో 'చలో హైదరాబాద్' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దార్ రాజేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సూర్యనాయక్‌తో పాటు జేఏసీ జిల్లా, మండల నాయకులు డి. రమేష్, ఎన్. భాస్కర్ రెడ్డి, సిహెచ్. రాజేంద్రము, సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, దాసరి రవీందర్, మాడుగుల నవీన్ కుమార్, డా. ఎ. కిషన్, ఆర్. బిక్షపతి, కే. కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు షహన, బి. ఉమ, బి. సుజాత, సుధారాణి, అనిత పాల్గొన్నారు.

## జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా గోపాలకృష్ణ

**నర్సంపేట/ఏప్రిల్ 18(జర్నలిస్ట్ వార్త);** వరంగల్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా నర్సంపేట పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, ప్రజాపక్షం దినపత్రిక జిల్లా స్టాఫర్ కోదాటి గోపాలకృష్ణ నియమితులయ్యారు. శుక్రవారం వరంగల్‌లోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో డీపీఆర్వో మహబూబ్ అలీ, అడిషనల్ డీపీఆర్వో ప్రేమలత చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యుజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రామచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గా ప్రసాద్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మెండు



రవీందర్ తదితరులు పాల్గొని గోపాలకృష్ణకు అభినందనలు తెలిపారు. జిల్లా కమిటీలో సభ్యుడిగా నర్సంపేట ప్రాంతానికి చెందిన సీనియర్ జర్నలిస్టుకు అవకాశం దక్కడం పట్ల పలువురు జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన అధికారులకు, తోటి జర్నలిస్టు మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజాస్వామ్యం ప్రమాదంలోకి- దళితులపై దాడులు ఆగట్లేదు!









**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 17( జర్నలిస్ట్ వార్త)** దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతోందని, దళితులపై అకృత్యాలు ఇంకా కొనసాగుతున్నాయని ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షుడు ఎ. రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి వి.ఎస్. నిర్మల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.వరంగల్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డి.హెచ్.పి.ఎస్) రెండో రాష్ట్ర మహాసభలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇస్లామీయా గ్రౌండ్ నుంచి అబ్బాస్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బందేలు నర్సయ్య హాల్‌లో బహిరంగ సభ జరిగింది.

**కాగితాలకే పరిమితమైన సమానత్వం**

స్వాతంత్ర్యం వచ్చిన 76 ఏళ్లైనా దళితులు ఇంకా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని నేతలు మండిపడ్డారు. సమానత్వం, సామాజిక న్యాయం, కుల నిర్మూలన మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు.

**రాజ్యాంగ విలువలు బలహీనతలో**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతిపాదించిన రాజ్యాంగ విలువలు ప్రస్తుత పరిస్థితుల్లో దెబ్బతింటున్నాయని అన్నారు. రాజ్యాంగ సంస్థలను బలహీనపరచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

**రిజర్వేషన్లపై ముప్పు**

ప్రైవేటీకరణ, ఆర్థిక విధానాల ప్రభావంతో రిజర్వేషన్ హక్కులు క్రమంగా క్షీణిస్తున్నాయని పేర్కొన్నారు. దళితులపై దాడులు, కులవివక్ష, భూమి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సమిష్టి పోరాటమే మార్గం**

రాజ్యాంగ పరిరక్షణ కోసం సామూహిక ఉద్యమం అవసరమని పిలుపునిచ్చారు. దళిత హక్కుల సాధనలో డి.హెచ్.పి.ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

**ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు తప్పనిసరి**

సీపీఐ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు పూర్తిగా ఖర్చు చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు తగ్గిపోతుండటంతో రిజర్వేషన్లు దెబ్బతింటున్నాయని చెప్పారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**భారీగా పాల్గొన్న నాయకులు**

ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు చేయాలి- నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

### పీఆర్‌సీ, డీఏ బకాయిల చెల్లింపుకు గట్టిగా డిమాండ్

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):** టీజీఈజేఏసీ పిలుపు మేరకు పీఆర్‌టీయూ టీఎస్ ధర్మసాగర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో, నినాదాలతో ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి జాన్




సింగ్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా అనిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై స్పందించాలని కోరారు.జూన్ 2లోపు పీఆర్‌సీని ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను రెండు విడతల్లో చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 2026 మే 1 నుంచి హెల్త్ కార్డులు అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ముఖ్యంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని గట్టిగా డిమాండ్ చేశారు.ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే నిరసన కార్యక్రమాన్ని ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. మహిళా ఉపాధ్యాయులు కూడా అధిక సంఖ్యలో హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రమాదాల వేళ ప్రాణరక్షణపై దృష్టి

### డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు




**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):** రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు అత్యంత కీలకమైన మొదటి గంట ప్రాధాన్యతపై ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఒకే శుక్రవారం విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు కొనసాగుతున్న అరైవ్అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది.ధర్మసాగర్ పోలీస్ ఇన్స్పెక్టర్ కె. శ్రీధర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే స్పందన ఎంతో కీలకమని వివరించారు. ప్రమాదం తర్వాత తొలి గంటలో సరైన చికిత్స అందిస్తే గాయపడిన వారి ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని పేర్కొన్నారు. గాయపడిన వారిని ఎలా సురక్షితంగా తరలించాలి, రక్తస్రావాన్ని ఎలా నియంత్రించాలి, అంబులెన్స్ వచ్చేలోపు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వంటి అంశాలను వివరించారు.



అత్యవసర పరిస్థితుల్లో గుండెశ్వాస పునరుద్ధరణ విధానం ప్రాణరక్షణలో కీలకమని 108 అత్యవసర సేవల సిబ్బంది ప్రాయోగికంగా చూపిస్తూ అవగాహన కల్పించారు. గుండె స్పందన ఆగిన సందర్భాల్లో తక్షణ చర్యలతో బాధితులను మళ్లీ ప్రాణాల్లోకి తీసుకురావచ్చని తెలిపారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, స్థానికులు ప్రత్యక్షంగా పాల్గొని పద్ధతులను నేర్చుకున్నారు.అనంతరం వాసన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఆటో, బస్సు డ్రైవర్లు మరియు ఇతర వాహనదారులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వాహనం నడిపే వారికి స్పష్టమైన చూపు అత్యవసరమని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదాలకు దారి తీసే అవకాశముందని వైద్యులు హెచ్చరించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు,



చికిత్స సూచనలు అందించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీధర్ రావు మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, వేగ పరిమితులు పాటించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమానికి ఆటో, బస్సు డ్రైవర్లు, వాహనదారులు, పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు అత్యవసర సమయంలో స్పందించే సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

### పెండ్యాల తిరుపతికి కండువా కప్పి ఆహ్వానం పలికిన మంత్రి పొన్నం ప్రభాకర్

**ఎల్కతుర్తి/, ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలం జగన్నాథపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, హుజురాబాద్‌లోని నవ్య చికెన్ సెంటర్ యజమాని పెండ్యాల తిరుపతి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం



ప్రభాకర్ సమక్షంలో ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.జగన్నాథపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముష్కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితుడై పార్టీలో చేరినట్లు పెండ్యాల తిరుపతి తెలిపారు.పార్టీ విధి విధానాలకు కట్టుబడి పనిచేస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్‌లు ఆరపెల్లి సమ్మయ్య, ఆరపెల్లి రమేష్, వార్డు సభ్యులు ఆరపెల్లి చిరంజీవి, పెండ్యాల కుమారస్వామి, సీనియర్ నాయకులు పెండ్యాల భాస్కర్, బండి కుమారస్వామి, పెండ్యాల సామెల్, పంజాల చేటారి గౌడ్, కేంసారపు సంపత్, పంజాల స్వామి, పెండ్యాల రాజేష్, మాటూరి శ్రీనివాస్, గుండాల మధు, గూటం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేయాలి- ఉద్యోగుల గళం

## డీఏ విడుదల, పీఆర్సీ అమలు కోసం వినతిపత్రం

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో**
**ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):**




తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ధర్మసాగర్ మండలంలో ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు భారీ సంఖ్యలో తరలి వచ్చి మండల తహసీల్దార్ సదానందంకు వినతిపత్రం సమర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ సమస్యలను ఏకగ్రీవంగా ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని వెంటనే స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీయర్నెస్ అలవెన్స్ (డీఏ)లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ను అమలు చేసి జీతాల సవరణ చేపట్టాలని కోరారు. ముఖ్యంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) స్థానంలో పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను తిరిగి ప్రవేశపెట్టాలని గట్టిగా నినాదాలు చేశారు. విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ, సీపీఎస్ విధానం వల్ల భవిష్యత్తులో ఆర్థిక భద్రత కరువవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పెద్దస్థాయి ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్సై ప్రవీణ్ కుమార్‌ను ఏఆర్‌కు అటాచ్ చేయడం బాధాకరం

## ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకుడు బొంకూరి రాజు

**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):**



ఎల్కతుర్తి మండలంలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్‌ను అకస్మాత్తుగా ఏఆర్‌కు అటాచ్ చేయడం బాధాకరమని ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకుడు బొంకూరి రాజు అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎస్సై ప్రవీణ్ కుమార్ మంచి నడవడి, వాక్చాతుర్యం, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగే వ్యక్తిత్వంతో గుర్తింపు పొందారని తెలిపారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని సేవలందించిన అధికారిగా ఆయనకు మంచి పేరు ఉందన్నారు. అయితే వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ తీసుకున్న ఈ నిర్ణయంపై మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఉన్నతాధికారులు మరోసారి పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఎస్సై ప్రవీణ్ కుమార్ డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి అక్రమ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించేవారని, అన్ని రాజకీయ పార్టీలతో సమానంగా వ్యవహరించేవారని పేర్కొన్నారు. ఇలాంటి అధికారిని బదిలీ చేయడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు.

# విశ్వశాంతిలో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు




**సత్తుపల్లి,/ ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):**
స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో ప్రాథమిక విద్య (1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు) పూర్తి చేసిన విద్యార్థులకు శుక్రవారంగ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. విద్యార్థుల విజయాన్ని అభినందిస్తూ పాఠశాల ప్రాంగణంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.
పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రాథమిక విద్యను విజయవంతంగా పూర్తి చేసి హైస్కూల్ విద్యలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం నరుకుళ్ల సత్యనారాయణ, అవినాష్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భానుడి భగభగ

# మూగజీవాలు విలవిల

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎండల దెబ్బ





**సత్తుపల్లి/, ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):**
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎండలు భగ్గుమంటున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలతో పాటు మూగజీవాలు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపిస్తూ సాయంత్రం వరకు వేడిమి తగ్గకపోవడంతో ఉక్కపోత మరింత పెరిగింది.
సత్తుపల్లి, అశ్వారావుపేట, ఇల్లందు, మణుగూరు, ధమ్మపేట, అన్నపురెడ్డిపల్లి ప్రాంతాల అటవీ ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రంగా ఉండడంతో వన్యప్రాణులు మైదాన ప్రాంతాలకు వలస వస్తున్నాయి. ఈ క్రమంలో వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్న ఘటనలు పెరుగుతున్నాయి.
నీరు లభ్యమయ్యే ప్రాంతాల్లో కూడా దాహార్తి తీర్చుకోవడానికి వచ్చే జంతువులు వేటగాళ్ల బారిన పడుతున్నాయి. అటవీ అధికారులు అలాంటి ప్రాంతాల్లో నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు. అటవీ విస్తీర్ణం తగ్గడం, మట్టి తవ్వకాలు పెరగడం వల్ల దుప్పులు, అడవి పందులు, కోతులు తదితర జంతువులు జనవాసాల్లోకి చేరుతున్నాయి. సింగరేణి పరిసర ప్రాంతాల్లో అధిక వేడిమితో ప్రజలు, మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. సింగరేణి అధికారులు పరిసర ప్రాంతాల్లో వాటర్



సదుపాయాలు కల్పించడంతో పాటు అటవీ ప్రాంతాల్లో సిమెంట్ తొట్టెల్లో నీరు నిల్వ చేసే చర్యలు తీసుకోవాలని వన్యప్రాణి ప్రేమికులు కోరుతున్నారు. అటవీ శాఖ కూడా ప్రత్యేక చర్యలు చేపట్టి మూగజీవాల ప్రాణాలను కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పీహెచ్‌డీ పట్టా అందుకున్న దారెల్లి తిమోతి

**తల్లాడ/, ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కొత్త వెంకటగిరి క్రాస్ రోడ్డుకు చెందిన దారెల్లి తిమోతి పీహెచ్‌డీ పట్టా సాధించారు. హైదరాబాద్‌లోని హెన్రీ మార్టిన్ ఇన్స్టిట్యూట్ రీసెర్చ్ సెంటర్‌లో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. గత మూడు దశాబ్దాలుగా పాస్టర్‌గా సేవలందిస్తూ వివిధ రంగాల్లో అంచెలంచెలుగా ఎదిగిన తిమోతి, 1994 నుంచి 1997 వరకు కేరళలో బ్యాచిలర్ ఆఫ్ థియాలజీ చదివారు. అనంతరం రెండు రాష్ట్రాల్లో పాస్టర్‌గా సేవలు అందిస్తూ 1999లో మాస్టర్ ఆఫ్ డివినిటీ పూర్తి చేసి బైబిల్ జ్ఞానాన్ని సంపాదించారు.
2018 నుంచి ఆర్చ్ బిషప్‌గా కొనసాగుతున్న ఆయన, సేవా కార్యక్రమాలతో పాటు విద్యారంగంలోనూ ప్రతిభ కనబరుస్తూ పీహెచ్‌డీ పట్టా సాధించడం విశేషం. ఈ



సందర్భంగా తిమోతి మాట్లాడుతూ, రెండు రాష్ట్రాల్లో ప్రజలకు సేవ చేయడం తనకు ఆనందాన్ని కలిగించిందని, పీహెచ్‌డీ సాధించడం మరింత సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు.



# ఇంటర్‌లో మెరిసిన పూర్వ విద్యార్థులకు ఘన సన్మానం

## కార్తీక్ విద్యాలయం కరస్పాండెంట్ మాధవ రెడ్డి, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

**వైరా, /ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):**
నియోజకవర్గ పరిధిలోని కార్తీక్ విద్యాలయంలో పదో తరగతి వరకు చదివి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకులు పొందిన పూర్వ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో కార్తీక్ విద్యాలయం కరస్పాండెంట్ మాధవ రెడ్డి, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎన్. గాహ్య 468/470, కే జై చంద్ర 466/470, టీ వైష్ణవి 463/470, ఎం హర్షిని 460/470 మార్కులు సాధించి ప్రతిభ చాటుకున్నారు. రెండో సంవత్సరం ఫలితాల్లో వై రమ్య 992/1000, కె యశ్వంత్ 982/1000, ఏ జస్వంత్ 977/1000, ఎస్కే నిఖిల్




పాషా 972/1000 మార్కులతో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. తమ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనతో పాటు క్రీడలు, టాలెంట్ టెస్టులు, ఇతర పోటీల్లో కూడా ముందుండేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరింత




మంది విద్యార్థులు ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామారావు, చంద్రశేఖర్, భాస్కర్, లాల్ సాబ్, శ్రీనివాస్, చంద్రకళాధర్ రావు, రాజు తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులందరికి విబిజి రామ్ జీ జాబ్ కార్డులు అందించాలి



## -సిపిఎం మండల కార్యదర్శి మధు..

**బయ్యారం,ఏప్రిల్ 17.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం జగ్గుతండ పంచాయతీలో తురుకొనికుంటలో జరుగుతున్న విబిజి రామ్ జీ పనులను సిపిఎం పార్టీ బయ్యారం మండలం కమిటీ నాయకులు సందర్శించారు.. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి నంబూరు మధు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని పేద మధ్యతరగతి, వ్యవసాయ కూలీలు,రైతులు పట్టణ ప్రాంతాలకు వలసలు తగ్గించడానికి నాటి వామపక్షా పార్టీల పోరాట ఫలితంగా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావడం జరిగిందని,ప్రతి వ్యక్తికి కనీసం 200 రోజుల పని దినాలు కల్పించాలని,పని జరిగే ప్రదేశాల్లో సేద తిరడానికి టెంటు,త్రాగునీరు,ఏదైనా ప్రమాదం జరిగితే వైద్య సదుపాయం కొరకు మెడికల్ కిట్టు ఏర్పాటు చేయాలన్నారు. ఇవన్నీ విబిజి రామ్ పథకంలో ఉన్నప్పటికీ మండల వ్యాప్తంగా జరుగుతున్న పని ప్రదేశాల్లో ఎలాంటి సౌకర్యాలు లేకుండా గతంలో మస్టర్ ద్వారా హాజరు వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం పని జరుగుతున్న ప్రదేశంలో రెండు ఫోటోలు తీయాలని నిబంధన పెట్టారని,కానీ కార్మికులు సెల్ ఫోన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తూ ఎండలో ఇబ్బంది పడుతున్నారని,ఫోటో ఆన్లైన్లో అప్లోడ్ చెయ్యడం ఇబ్బంది ఉన్నందున దానిని తొలగించి పాత పద్ధతిలోనే మస్టర్ వేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అదేవిధంగా అర్హులందరికి జాబ్ కార్డులను అందించాలని,రోజుకు 600 రూపాయలు పని కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ వల్లాల వెంకన్న,కో కన్వీనర్ అంగిరేకుల నాగేశ్వరరావు,కెవిపిఎస్ నిడికొండ చంటి,వార్డ్ మెంబర్ గుగులోతు రూపేష్,బొబ్బిలి వెంకన్న,కిషోర్,నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు

# సహాయం చేస్తే పారితోషికం




**ఎల్కతుర్తి/ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):**
రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి సమాచారం ఇచ్చే వారికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా పారితోషికం అందజేస్తుందని ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ప్రజలు, ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాలమైన రహదారులపై వేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సేవల నంబర్లకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని చెప్పారు. ఇలా సమాచారం అందించి గాయపడిన వారికి సహాయం చేసే వారికి ‘రణవీర్’ బిరుదుతో పాటు రూ. 25,000 పారితోషికం అందజేస్తారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ప్రతి కేంద్రంలో రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. హన్మకొండ డిపో నిర్వాహకుడు ధరమ్ సింగ్, రామచందర్, డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో ప్రాథమిక చికిత్సగా గుండె స్పందన పునరుద్ధరణ విధానాన్ని అమలు చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అబిదుల్లా, హెడ్ కానిస్టేబుల్ విటల్, సారంగపాణి, కానిస్టేబుళ్లు, హోం గార్డులు తదితరులు పాల్గొన్నారు.

# పెంచికల్పేట్ గ్రామ అభివృద్ధే లక్ష్యం

**ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు -సర్పంచ్ ముప్పు శైలజ శ్రీనివాస్**






**ఎల్కతుర్తి, /ఏప్రిల్ 17 (జర్నలిస్టు వార్త):** మండలంలోని పెంచికల్పేట్ గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ ముప్పు శైలజ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామంలో నిర్వహించిన సమావేశంలో సర్పంచ్, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, రోడ్ల శుభ్రత, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇంకా అభివృద్ధి పనుల కోసం మంత్రిగారి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. పెంచికల్పేట్ నుండి శాంతినగర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రమాదాలను నివారించేందుకు రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా విద్యార్థులు మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని సర్పంచ్ శైలజ శ్రీనివాస్ తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కొనుగోలు ప్రారంభించాలి

**తెదేపా నేత రావూరి రవిప్రసాద్**



**తల్లాడ, /ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):** మండలంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అట్టహాసంగా ప్రారంభించినప్పటికీ కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తున్నదని, తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు రావూరి రవిప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారంవిలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో కేంద్రాలను అధికారికంగా ప్రారంభించినా, అక్కడ రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని అదునుగా చేసుకుని కొంతమంది దళారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.రైతులకు నష్టాలు కలగకుండా వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రెండో విడత రైతు భరోసా నిధులను త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

# చింతలపల్లిని మరో గంగాదేవిపల్లిగా తీర్చిదిద్దుతాం

**సర్పంచ్ బొంకూరి రజిత**





**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని చింతలపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా, మరో గంగాదేవిపల్లిగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని సర్పంచ్ బొంకూరి రజిత రవీందర్ తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలు, పాలకవర్గం కలిసికట్టుగా పనిచేస్తే సాధ్యమని ఆమె పేర్కొన్నారు.గ్రామంలో విశాలమైన రోడ్లు, శుభ్రమైన డ్రైనేజీ వ్యవస్థలను ఆధునికంగా ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలు అవసరమని తెలిపారు. తాగునీరు, శుభ్రత వంటి ప్రాథమిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.పాఠశాలల్లో మెరుగైన విద్య అందించడమే కాకుండా, ఆసుపత్రుల ద్వారా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బందితో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. వెనుకబడిన విద్యార్థుల కోసం స్వంత నిధులతో ట్యూషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు గ్రామ సభల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి "మన ఊరు మన కార్యక్రమం" కింద ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రత్యేక గదులు, అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. అంగన్వాడి పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

అదేవిధంగా 18 ఏళ్లు పూర్తైన యువతకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో గంజాయి, గుడుంబా, మద్యం, పాన్ మసాలా వంటి వ్యసనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ కూడా చేపట్టినట్లు వెల్లడించారు.ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ వివిధ అభివృద్ధి ప్రణాళికల ద్వారా చింతలపల్లిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని సర్పంచ్ రజిత తెలిపారు.

# సింగరేణి గని కార్మికులకు వడదెబ్బ నివారణపై అవగాహన సదస్సు





**సత్తుపల్లి/ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):** వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా గని కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం జెవిఆర్ఓసి ప్రాజెక్టు అధికారి ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ లలిత హాజరై కార్మికులకు వడదెబ్బ నివారణపై పలు సూచనలు చేశారు.ఎండల్లో పనిచేసే కార్మికులు నిరంతరం నీరు తాగుతూ ఉండాలని, శరీరంలో నీరు తగ్గిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. సంస్థ అందిస్తున్న ఉప్పు చక్కెర ద్రావణం, మజ్జిగ వంటి పానీయాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. తలనొప్పి, తిమ్మిరి, అలసట వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని హెచ్చరించారు.జెవిఆర్ఓసి గనితో పాటు ఓబీ శిబిరాలైన సుషీ హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్, పి.సి. పటేల్ సంస్థల వద్ద కూడా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గని నిర్వాహకుడు బి. రాజేశ్వరరావు, కార్యకలాపాల నిర్వాహకుడు జి. కళ్యాణ్ రామ్, భద్రతాధికారి ఎస్. గోవిందు, సంక్షేమ అధికారి డి. కావ్య, కార్మిక సంఘ నాయకులు శ్రీధర్, జి. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.కార్మికులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండి సూచనలు పాటించాలని అధికారులు సూచించారు.

# అంబులెన్స్ లోనే సుఖ ప్రసవం.

**-ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది.**



**బయ్యారం,ఏప్రిల్ 17.(జర్నలిస్ట్ వార్త)** అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి ఓ గర్భిణికి సుఖ ప్రసవం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. బయ్యారం మండలం నామాలపాడు లో ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఒడిస్సా కు చెందిన కార్మికురాలు రశ్మిత (20) భర్త కుమార్ గురువారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారం అందించారు.వెంటనే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో నొప్పులు తీవ్రమయ్యాయి.పరిస్థితిని గమనించిన మెడికల్ టెక్నీషియన్ శ్రీను,పైలట్ ఉపేందర్ వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి,అంబులెన్స్ లోనే డెలివరీ కిట్ సహాయంతో సుఖ ప్రసవం చేశారు.రశ్మిత పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది.ఎమర్జెన్సీ రెస్పాన్స్ కేర్ ఫిజిషియన్ డాక్టర్ కాసిరెడ్డి ఫోన్ ద్వారా అందించిన సూచనల మేరకు తల్లికి ఐవి ఫ్లూయిడ్ ఇచ్చి,శిశువుకు ఆక్సిజన్ అందిస్తూ సురక్షితంగా మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం తల్లి,బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.సమయానికి స్పందించి ప్రాణాలు కాపాడిన ఈఎంటీ శ్రీను, పైలట్ ఉపేందర్ ను స్థానికులు, ఆసుపత్రి సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# జాగ్రత్తలు పాటిద్దాం

**ఎండ తీవ్రత నుంచి సురక్షితంగా ఉండదాం**



**సత్తుపల్లి/ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):** వేసవి ఎండలు రోజురోజుకీ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. రాబోయే రోజుల్లో వడగాలులు మరింతగా వీచే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని, ప్రయాణాలు ఉదయం 9 గంటల లోపు లేదా సాయంత్రం 4 గంటల తర్వాతే కొనసాగించాలని సూచిస్తున్నారు. బయటకు వెళ్లేటప్పుడు తాగునీరు వెంట తీసుకెళ్లడం తప్పనిసరి. ఎండ ఎక్కువగా ఉన్న రోజుల్లో గొడుగు వినియోగించుకోవడం, దూది తో నేయబడిన తెలుపు లేదా లేత రంగు పలుచటి దుస్తులు ధరించడం మంచిదని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో నెత్తికి టోపీ లేదా రుమాలు ధరించడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. శరీరంలో నీటి లోపం రాకుండా ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ కలిపిన నీరు, మౌఖిక ద్రావణం వంటి పానీయాలు తరచూ తీసుకోవాలని సూచించారు.

వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లటి ప్రదేశానికి తరలించి, చల్లటి నీటిలో నానబెట్టిన గుడ్డతో శరీరాన్ని తుడవాలి. ఫ్యాన్ క్రింద ఉంచి విశ్రాంతి కల్పించాలి. అయినా పరిస్థితి మెరుగుపడకపోతే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. అలసట, తలనొప్పి, మైకం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సహాయం పొందడం అవసరమని హెచ్చరించారు. వేసవిలో తాజా పండ్లు ముఖ్యంగా పుచ్చకాయ, కర్బూజ, అరటి వంటి వాటిని ఆహారంలో చేర్చుకోవడం ద్వారా శరీరానికి చల్లదనం లభిస్తుందని తెలిపారు. వడదెబ్బ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# సింగారం అంగన్వాడి కేంద్రంలో గర్భవతులకు సీమంతం.





**బయ్యారం/,ఏప్రిల్ 17.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలంలోని సింగారం గ్రామ పచాయతీలోని అంగన్వాడి కేంద్రంలో గర్భవతులకు సీమంతం,పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు.గర్భిణిలకు పసుపు, కుంకుమ, స్వీట్లు, పూలు,పండ్లు,చీర, గాజులతో సాంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి రాందాస్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ గర్భవతులకు సీమంతం ద్వారా పుట్టింటి వద్ద అందాల్సిన అపూర్వ గౌరవం అంగన్వాడి కేంద్రంలో అందాలని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్,ఉపసర్పంచ్ చుంచు మమతా,అంగన్వాడీ టీచర్ గంగావత్ పద్మ,అంగన్వాడి ఆయలు,ఆశ వర్కర్లు మహిళలు పాల్గొన్నారు.

# లోక్ సభలో మహిళా బిల్లు వీగిపోవడానికి పూర్తి బాధ్యత బీజేపీదే: కేటీఆర్



**ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):** ఇప్పటికైనా డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు తేవాలని సూచన

లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ పన్నిన కుటిల రాజకీయాల వల్లే దేశంలోని మహిళా లోకానికి దక్కాల్సిన రిజర్వేషన్లు వెంటనే దక్కకుండా పోయాయని మండిపడ్డారు.

బీఆర్ఎస్ సహా దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు పలికినప్పటికీ, బీజేపీ కావాలనే డీలిమిటేషన్ పేరుతో చిక్కుముళ్లు తెచ్చిపెట్టి బిల్లు విఫలమయ్యేలా చేసిందని ఆరోపించారు. మహిళా సాధికారతపై బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి నేటి పరిణామాలతో తేలిపోయిందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అనవసరంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంతో ముడిపెట్టడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు.ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లతోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేసి ఉంటే ఎటువంటి సమస్య వచ్చేది కాదని, కానీ మహిళల రిజర్వేషన్ల అంశాన్ని ముడిపెట్టి దేశ మహిళల భుజాల మీద నుంచి దక్షిణాది రాష్ట్రాల గొంతు కోయాలని బీజేపీ చూసిందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను, డీలిమిటేషన్ పర్యవసానాలను పట్టించుకోకుండా మొండిగా ముందుకు పోవడంతో ఒక చారిత్రక అవకాశం జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల స్థలాల ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

**పర్వతగిరి/ఏప్రిల్ 17(జర్నలిస్ట్ వార్త);**
మండలంలోని వడ్లకొండ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని కొంతమంది దళారులు ఆక్రమించుకున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్పీ (RSP) వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పర్వతగిరి తహసీల్దార్‌కు ఫిర్యాదు అందజేశారు.



**అసలేం జరిగింది?**
గత 2006 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లకొండ గ్రామంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు సిద్ధమైంది.
ఇందులో భాగంగా:
సర్వే నంబర్ 432విస్తీర్ణం 3 ఎకరాల 10 గుంటలువివరాలు: గ్రామానికి చెందిన ఎండీ. ఘఫూర్ మియా (జానీ మియా) వద్ద నుంచి ప్రభుత్వం ఈ భూమిని కొనుగోలు చేసింది.

**దళారుల హస్తం..**
ప్రభుత్వం నిరుపేదల కోసం సేకరించిన ఈ భూమిపై పక్కా ప్రణాళికతో కొంతమంది దళారులు కన్నేశారని వల్లందాస్ కుమార్ ఆరోపించారు. సదరు భూమిని అక్రమంగా ఆక్రమించి, ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.
పేదల సొంతింటి కలను ఛిద్రం చేస్తూ ప్రభుత్వ భూమిని విక్రయించాలని చూస్తున్న దళారులపై రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని , ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శివల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని తహశీల్దార్ కు వినతి.



**బయ్యారం,ఏప్రిల్ 17.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ పిలుపుమేరకు శుక్రవారం పిఆర్ పియు టిఎస్ బయ్యారం మండల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి మండల తహశీల్దార్ నాగరాజు కీ వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పిఆర్ టియు టిఎస్ బయ్యారం మండల అధ్యక్షులు మోహన్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ,ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించాలని,పిఆర్సి తక్షణమే అమలు చేయాలని,పెండింగ్ డిఏలను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నీలం శ్రీనివాస్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు గాయత్రి, జిల్లా కార్యదర్శి సుధాకర్,మండల కార్యదర్శి సునీత,పల్లవి,రామారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ,ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ కు వినతి.



**బయ్యారం/,ఏప్రిల్ 17.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ ఉద్యోగ గెజిటెడ్ అధికారులు,ఉపాధ్యాయ,పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యలపై బయ్యారం తాహశీల్దార్ నాగరాజు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు నాయకులు మాట్లాడుతూ పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని,పిఆర్సి నివేదికను తెప్పించుకొని వెంటనే అమలు చేయాలన్నారు. గత కొన్ని రోజులుగా పెండింగ్ లో ఉన్న డిఏ లను మంజురి చెయ్యాలని,ఉద్యోగులు,పెన్షనర్ల బకాయిలన్నీ ఏక మొత్తంలో చెల్లించాలని,ఉద్యోగుల,పెన్షనర్లకు హెల్త్ కార్డులను జారీ చేయాలని, రాష్ట్రంలో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ మండల అధ్యక్షులు జి. బాలు నాయక్,టీఎస్ సిపిఎస్ఈయు బయ్యారం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భానోత్ రవీందర్ నాయక్,దస్తగిరి,టీపీటీఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిషన్,భవుసింగ్ ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు అజ్మీరా రూప్లా నాయక్,భద్రు నాయక్,తెలంగాణ పెన్షనర్స్ సంఘ రాష్ట్ర నాయకులు వై. హనుమంత్ ప్రసాద్,మండల ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాస రావు,సునీల్, తావు, ప్రవీణ్,కొలిపాక శ్రీనివాస్,హత్తి రామ్,మండల రెవెన్యూ ఉద్యోగులు పంచాయతీ,జిపిఓ లు, ఉద్యోగులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గురు శిష్యుల పాత్రలు మారిన వేళ..

## నల్లబెల్లిలో అలరించిన సెల్ఫ్ గవర్నమెంట్ డే

**వర్ధన్నపేట/ ఏప్రిల్ 17 (జర్నలిస్ట్ వార్త):**
పాఠశాల గంట మోగింది. ప్రార్థన ముగిసింది. కానీ ఈరోజు క్లాసులోకి వెళ్తోంది మామూలు మాస్టార్లు కాదు, చిన్నారి ఉపాధ్యాయులు,వర్ధన్నపేట మండలం నల్లబెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో శుక్రవారం సెల్ఫ్ గవర్నమెంట్ డే వేడుకలు కనువిందుగా జరిగాయి. ఉపాధ్యాయుల వేషధారణలో వచ్చిన విద్యార్థులు రోజంతా పాఠశాల బాధ్యతలను భుజానికెత్తుకున్నారు.
ముచ్చటగొలిపిన చిన్నారి మాస్టార్ల బోధన
ఉదయం నుంచే విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన చేశారు. కొందరు హెడ్ మాస్టర్లుగా పాఠశాల నిర్వహణను పర్యవేక్షించగా, మరికొందరు టీచర్లుగా మారి నల్లబల్లపై పాఠాలు రాస్తూ తోటి విద్యార్థులకు వివరించారు. క్రమశిక్షణ తప్పకుండా, ఎంతో ఆత్మవిశ్వాసంతో పిల్లలు పాఠాలు చెబుతుంటే చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆశ్చర్యంతో పాటు



ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు రాజు, సదానందం, పరిపూర్ణ చారి, రెహ్మతున్నిసలు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారిలో స్టేజ్ ఫియర్ పోగొట్టి నాయకత్వ లక్షణాలు పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తి పట్ల గౌరవం పెరగడానికి ఇలాంటి రోజులు వేదికలవుతాయని వారు తెలిపారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పుష్పలత విద్యార్థుల ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.










